## క్లుప్తంగా

### ఎక్స్‌ప్రెస్ బస్సులు నడిపేందుకు సర్వే



అర్వపల్లిలో ప్రయాణికుల అభిప్రాయాలు తీసుకుంటున్న ఆర్టీసీ సిబ్బంది

అర్వపల్లి : సూర్యాపేట–జనగామ 365బీ హైవేపై ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపడానికై సోమవారం ఈ రూట్లోని బస్సులలో ఆర్టీసీ సిబ్బంది సర్వే చేశారు. అలాగే ప్రయాణికుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. ప్రయాణికులు ఎక్స్‌ప్రెస్ బస్సులలో పయనిస్తారా లేదా అనే విషయమై తెలుసుకుంటున్నట్లు సూర్యాపేట ఆర్టీసీ డీఎం డి.సురేందర్, అసిస్టెంట్ మేనేజర్ పి.నాగశ్రీ తెలిపారు. ప్రయాణికుల కోరిక మేరకు త్వరలోనే ఈ రూట్లో ఎక్స్‌ప్రెస్ బస్సులను నడపనున్నట్లు చెప్పారు.

### మంచినీటి సరఫరాలో అంతరాయం

భానుపురి : ఇమాంపేట 95 ఎంఎల్‌డీ నీటి శుద్ధి కేంద్రం పరిధిలో అవంతిపురం నుంచి వచ్చే పైప్ లైన్‌కు లీకేజీ కారణంగా మరమ్మతులు చేపడుతున్నందున ఈ నెల 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు మూడు రోజులపాటు మంచినీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మిషన్ భగీరథ గ్రిడ్ సూర్యాపేట సబ్ డివిజన్ అధికారి రాజేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేట, కోదాడ మున్సిపాలిటీలకు అలాగే 188 ఆవాసాలకు నీటి సరఫరా జరగదని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో మున్సిపల్ చైర్మన్లు, కమిషనర్లు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

### కుంచమర్తి పాల సంఘం చైర్మన్‌గా సైదులు



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం కుంచమర్తి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం చైర్మన్‌గా గ్రామానికి చెందిన కందుకూరి సైదులు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే డైరెక్టర్లుగా తోట జానయ్య, ఏడుదొడ్ల వెంకరెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికను ఎన్నికల అధికారి బీరవోలు వీరారెడ్డి నిర్వహించారు. కాగా చైర్మన్, డైరెక్టర్లను ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్య యాదవ్, సర్పంచ్ ఉగ్గం ఉపేంద్రలింగరాజు అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాలఉత్పత్తిదారులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

### 30న సర్వసభ్య సమావేశం

పెన్‌పహాడ్ : మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 30న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్ తెలిపారు. సోమవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని అన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమావేశానికి హాజరై సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

### లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటాలి

నూతనకల్ : హరితహారం కార్యక్రమం ద్వారా లక్ష్యానికి అనుగుణంగా అధికారులు మొక్కలు నాటే విధంగా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ ఇందిర అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. హరితహారం కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో మొక్కలు నాటి ఆకుపచ్చ తెలంగాణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### బౌద్ధ సంప్రదాయంలో పుణ్యానుమోదన

నాగారం : మండల పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు పాక రాములమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు పాక లింగమల్లు–స్వప్నలు సోమవారం మృతురాలి దశదిన కర్మను బౌద్ధ సంప్రదాయంలో పుణ్యానుమోదన పేరుతో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆచార్య అరియ నాగసేన బోధి ముఖ్య అతిథిగా హాజరై నిర్వహించారు. అనంతరం దమ్మ ప్రవచనం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాసకులు లింగాల అంజయ్య, బుక్కరాజు తిరుపతియాదవ్, రావుల వినయ్, బహుజన నాయకులు వెంకట్, ధనుంజయ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



డి.కొత్తపల్లిలో మృతురాలు రాములమ్మకు నివాళులర్పిస్తున్న నాగసేన బోధి

# ‘హరిత’ లక్ష్యం నెరవేరేలా..

- 9వ విడత హరితహారం పనుల్లో నిమగ్నమైన అధికారులు, కూలీలు
- ఆయా గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటేలా ప్రణాళికలు



పెన్‌పహాడ్ : అనంతారం–దోసపహాడ్ రోడ్డులో మొక్కలు నాటేందుకు గుంతలు తీస్తున్న కూలీలు



మద్దిరాల : కుక్కడం వననర్సరీలో పెరిగిన వివిధ రకాల మొక్కలు

పెన్‌పహాడ్ : హరితహారం కార్యక్రమం తొమ్మిదో విడతలో భాగంగా మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. పెన్‌పహాడ్ మండలంలోని 29 గ్రామ పంచాయతీల పరిధిలో 29 వన నర్సరీ కేంద్రాలను ఏర్పాటు చేసి వాటిలో 2లక్షల 43వేల మొక్కలను పెంచారు. ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ భూములు, పాఠశాలలు, కళాశాలలు, కాల్వ గట్ల వెంట, రహదారులు వెంబడి లక్ష 91వేల మొక్కలను నాటే విధంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఏటా నిర్వహిస్తున్న హరితహారం కార్యక్రమంలో విరివిగా మొక్కలు నాటి వాటిని గ్రామ పంచాయతీల సిబ్బంది కాపాడుతుండటంతో గ్రామాల్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఇప్పటికే ఎనిమిది విడతల్లో మొక్కలు నాటగా ఇందులో కానుగ, చింత, మునగ, ఖర్జూరా, వేప, దానిమ్మ, జామ, రావి, నీలగిరి, గోరింటాకు, కరివేపాకు, నేరడు, పతంగి తదితర మొక్కలు ఉన్నాయి.

**మద్దిరాల మండల పరిధిలో 1,67,123 మొక్కలు నాటడం లక్ష్యం..**

మద్దిరాల : మద్దిరాల మండల పరిధిలో మొత్తం పదిహేను గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అయితే ఉపాధి హామీ పథకం ద్వారా ఊరికో నర్సరీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ నర్సరీల్లో పూలు, పండ్ల మొక్కలతో పాటు నీడనిచ్చే మొక్కలను సైతం పెంచినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. మద్దిరాల మండలంలో మొత్తం 1,67,123 మొక్కలను నాటడం లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటికే 11వేల మొక్కలను నాటగా.. 20వేల గుంతలను మొక్కలను నాటడానికి సిద్ధంగా ఉంచినట్లు అధికారులు తెలుపుతున్నారు.

**లక్ష్యం నెరవేరుస్తాం**



9వ విడత హరితహారం కార్యక్రమంలో భాగంగా మండలంలో లక్షా 91వేల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ నెల 19న దశాబ్ది ఉత్సవాల్లో మొక్కలు నాటాము. ఈ విడతలో లక్ష్యం మేరకు నాటేలా ఏర్పాట్లు చేశాం. – రవి, ఏపీఓ, పెన్‌పహాడ్

**తగిన ఏర్పాట్లు చేస్తున్నాం**



తొమ్మిదో విడత హరితహారం మొక్కల లక్ష్యాన్ని చేరేందుకు తగిన చర్యలు చేపడుతున్నాం. హరితహారం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 1,67,123 మొక్కలను నాటడమే లక్ష్యం. ఇప్పటికే 11వేల మొక్కలు నాటాము. హరితహారంలో భాగంగా మిగిలిన మొక్కలను నాటేందుకు గుంతలను సిద్ధం చేస్తున్నాం. – గుండు వెంకన్న, ఏపీఓ, మద్దిరాల

# గీత కార్మికులకు చెక్కుల పంపిణీ



చెక్కు అందుకుంటున్న వెంకన్నగౌడ్

అర్వపల్లి : మండలంలోని పర్సాయపల్లి, కోడూరు గ్రామాలతో పాటు నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా, ప్రమాద బీమా చెక్కులను సోమవారం ఆయా గ్రామాల్లో పంపిణీ చేసినట్లు తెలంగాణ గౌడవిద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొల్కపురి శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. పర్సాయపల్లికి చెందిన కుంభం వెంకన్న గౌడ్ శాశ్వత అంగవైకల్యానికి గురికావడంతో రూ.5లక్షలు, కోడూరుకు చెందిన దేశగాని జానయ్యకు బీమా చెక్కులను అందజేసినట్లు చెప్పారు. అలాగే నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన సీహెచ్.వీరమల్లయ్య, అంబటి వెంకన్న, సోమ సైదులు, బాలగోని నారాయణ, ఎం.శ్రీనుతో పాటు 20 మంది గీత కార్మికులకు వివిధ రకాల చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గీత కార్మికులను అన్ని విధాలుగా ఆదుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో గీత కార్మికసంఘం నాయకులు కృష్ణమూర్తి, లింగస్వామి, నవీన్, సుమంత్, యల్లయ్య, మల్లయ్య, మురళి, సత్తయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు పనులను పూర్తిచేయాలి



మాట్లాడుతున్న కడియం కుమార్

నాగారం : నాగారం మండల పరిధిలోని వర్ధమానుకోట నుంచి నర్సింహులగూడెం వరకు మంజూరైన మెటల్‌రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కడియం కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్ధమానుకోట నుంచి నర్సింహులగూడెం వరకు మెటల్ రోడ్డు మంజూరై రెండేళ్లు గడుస్తున్నా నేటికీ రోడ్డు పనులు ప్రారంభం కాలేదన్నారు. కేవలం కల్వర్టు కట్టి వదిలేశారని అన్నారు. ఈ దారి వెంట నిత్యం రైతులు, ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. వర్షాకాలం కావడంతో బురద దారిలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రోడ్డు పనులు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని రోడ్డు పనులను వెంటనే ప్రారంభించేలా చూడాలని కోరారు. ఆయనతో పాటు సీపీఎం నాయకులు గూడపూరి వెంకటేశ్వర్లు, తీగల వెంకన్న, వీరయ్య, భిక్షం, రాములు తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో పఠనోత్సవం



తిరుమలగిరి పాఠశాలలో పాఠ్యపుస్తకాలు చదువుతున్న విద్యార్థులు



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో..

తిరుమలగిరి : తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కె.అశోక్‌రెడ్డి సోమవారం పఠనోత్సవం (రీడింగ్ క్యాంపెయిన్) కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులతో పాఠ్య పుస్తకాలు చదివించారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి మండల విద్యాధికారి ఐ.శాంతయ్య, ప్రధానోపాధ్యాయుడు కె.అశోక్‌రెడ్డి, ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం పఠనోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 1 నుంచి 10వ తరగతి వరకు రోజు ప్రతి తరగతికి ఒక పీరియడ్‌ను పఠనానికి కేటాయిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ప్రతి సబ్జెక్టు ఉపాధ్యాయుడు బోధనలో అంతర్భాగంగా పిల్లలతో పాఠ్యాంశాన్ని 10 నిమిషాలపాటు పెద్దగా చదివించనున్నట్లు చెప్పారు. ఈ నెల 31 వరకు పఠనోత్సవ కార్యక్రమం జరుగుతుందని ఎంఈఓ బాలునాయక్ తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్ఎంలు జెల్లా ప్రసాద్, కె.తబిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలతోనే రాష్ట్ర అభివృద్ధి



ప్రచార కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

మద్దిరాల : కేంద్ర ప్రభుత్వ పథకాలతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని బీజేవైఎం జిల్లా నాయకుడు యాటకారి మహేష్ అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య పిలుపు మేరకు సోమవారం మండల పరిధిలోని చందుపట్ల గ్రామంలో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు బెజ్జంకి సోమిరెడ్డి, గణేష్, అల్లి రవి, అల్లి మధు, తదితరులు పాల్గొన్నారు.

# పాడి రైతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



పాడి రైతులకు గడ్డి గింజల ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న నార్ముల్ జిల్లా డైరెక్టర్ సురేందర్‌రెడ్డి

సూర్యాపేట రూరల్ : పాడి రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని నార్ముల్ జిల్లా డైరెక్టర్ చల్లా సురేందర్‌రెడ్డి అన్నారు. పాడి రైతులకు ప్రభుత్వం అందజేసిన గడ్డి గింజల ప్యాకెట్లను సోమవారం సోలిపేట గ్రామంలో పంపిణీ చేసి మాట్లాడారు. గత ప్రభుత్వాల హయాంలో పాడి రైతులను పట్టించుకున్న వారు లేరని అన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ పాడి అభివృద్ధికి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు చల్లా రాఘవరెడ్డి, కందుల అశోక్‌రెడ్డి, మారం నాగిరెడ్డి, పల్స జానయ్య, గొట్టిపర్తి కోటయ్య, మేకలి బచ్చయ్య, పల్స క్రిష్ణయ్య, కందుల కుశలవరెడ్డి, పుల్లారెడ్డి, రాజేందర్‌రెడ్డి, శ్యామ్ సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఆత్మకూరు(ఎస్) : ఆత్మకూరు మండల పరిధిలోని ఏపూరు గ్రామ జెడ్పీహెచ్‌ఎస్‌లో 2005–06 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సోమవారం నెమ్మికల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకొని గత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, పుప్పాల మల్లయ్య, పజ్జూరి భిక్షం, పచ్చిపాల మల్లయ్య, డేగల సత్యనారాయణ, శంకర్, లాలు, తమిమ్ సుల్తానతో పాటు పూర్వ విద్యార్థులు లింగయ్య, ఉపేందర్, మల్లేష్, లింగయ్య, రాము, రఘుపతి, భిక్షం, లలిత, కరుణ, గౌతమి, శోభ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని నిషేధించాలి



బయో డీ గ్రేడ్ వస్తువులను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

కోదాడఅర్బన్ : ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని నిషేధించాలని, ప్లాస్టిక్ రహిత వస్తువులను వినియోగించాలని కోదాడ మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, పట్టణ ప్రముఖ వైద్యుడు డాక్టర్ జాస్తి సుబ్బారావు సూచించారు. సోమవారం సాయంత్రం కోదాడలో ఏఐఎంసీటీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన బయో డీ గ్రేడ్ వస్తువుల స్టోర్‌ను వారు ప్రారంభించి మాట్లాడారు. ప్లాస్టిక్ వస్తువుల వల్ల పర్యావరణ కలుషితం అవుతుందని అన్నారు. దీనిని నివారించాలంటే ప్లాస్టిక్ రహిత వస్తువుల వాడకాన్ని ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కట్టబోయిన శ్రీనివాస్, అనంతారపు బ్రహ్మం, ఈదల కృష్ణయ్య, షేక్ రహీం, సంస్థ చైర్మన్ ఎండీ షరీఫ్, సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జానీ, మార్కెటింగ్ సిబ్బంది ఉదయ్య, అలీ, రామకృష్ణ, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

# పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని వినతులు



తిరుమలగిరి : తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రిటైర్డు ఉద్యోగులు



ఆత్మకూరులో..



నూతనకల్‌లో..

తిరుమలగిరి : దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని రిటైర్డు ఉద్యోగులు సోమవారం తిరుమలగిరి తహసీల్దార్ రమణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు జి.సుదర్శన్‌రావు, కార్యదర్శి భన్సారి నర్సయ్య పాల్గొని మాట్లాడారు. అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో పెన్షనర్లకు హెల్త్ కార్డులు అమలు పరచాలని, 2వ పీఆర్‌సీని నియమించి మధ్యంతర భృతిని విడుదల చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలను చెల్లించాలని, ప్రతి నెల మొదటి తేదీనే పెన్షన్లు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.పద్మారెడ్డి, ఎం.రాములు, పి.సత్యనారాయణ, నర్సయ్య, రెహమాన్‌అలీ, దామోదరాచారి, సత్తిరెడ్డి, రాంరెడ్డి, మల్లయ్య, అమృతారెడ్డి, సారంగపాని పాల్గొన్నారు.

ఆత్మకూరు (ఎస్) : తెలంగాణ ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం మండల శాఖ అధ్యక్షుడు గణపరపు పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి తంగెళ్ల లక్ష్మీకాంతారెడ్డి అన్నారు. పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ పుష్పకు అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు వెంకటయ్య, వీరారెడ్డి, జానయ్య, బాబురావు, భాస్కర్, అబ్దుల్లా, జయమ్మ, రుద్రమ్మ, వెంకటయ్య, మల్లయ్య, సీతమ్మ, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ ఎండీ జమీరుద్దీన్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం ఉమ్మడి మండలాల అధ్యక్షుడు ఏలేటి నారాయణరెడ్డి మాట్లాడారు. 1వ పీఆర్సీ సిఫార్సులకు అనుగుణంగా పెన్షనర్ల మూల వేతనం నుంచి 1శాతం మినహాయించి పూర్తి స్థాయిలో ఈహెచ్‌ఎస్ అమలు చేయాలన్నారు. పెండింగ్ డీఆర్‌లు చెల్లించాలని, ప్రతి నెలా 1న పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం ఉమ్మడి మండలాల కార్యదర్శి బందు కృష్ణయ్య, ఎండీ జాన్, రామస్వామి, సత్యనారాయణరెడ్డి, హన్మంతరావు, ఆలగడప సత్యనారాయణ, మైసయ్య, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

**28న కలెక్టరేట్ వద్ద నిరసన**

అర్వపల్లి : పెన్షన్‌దారుల అపరిష్కృత సమస్యల పరిష్కారానికి ఈ నెల 28న కలెక్టరేట్ వద్ద జరిగే నిరసన కార్యక్రమానికి పెన్షన్‌దారులు తరలిరావాలని ప్రభుత్వ పింఛన్‌దారుల జేఏసీ జిల్లా కోశాధికారి మన్నె యాదగిరి కోరారు. సోమవారం ఈ మేరకు అర్వపల్లిలో నిరసన కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పింఛన్‌దారులు నిరసన తెలిపి కలెక్టర్‌కు మెమోరాండం అందజేస్తారని చెప్పారు. పీఆర్సీ నియామకం, ఐఆర్ ప్రకటన చేయాలని, ఓపీఎస్ పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పింఛన్‌దారుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

# 29న తిరుమలగిరిలో ప్రగతి నివేదన సభ



అర్వపల్లి : రామన్నగూడెంలో మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు సోమేష్‌గౌడ్



తుంగతుర్తి : గానుగుబండలో మాట్లాడుతున్న గుండగాని రాములుగౌడ్

అర్వపల్లి : తిరుమలగిరిలో ఈ నెల 29న జరిగే ప్రగతి నివేదన సభను జయప్రదం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష గౌడ్ కోరారు. ప్రగతి నివేదన సభ విజయవంతానికై సోమవారం రామన్నగూడెంలో బీఆర్‌ఎస్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సభకు మంత్రులు కేటీఆర్, జగదీష్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, జిల్లా నాయకుడు మన్నె లక్ష్మీనర్సయ్యయాదవ్, గ్రామశాఖ అధ్యక్షుడు ఓర్సు వెంకన్న, పొట్టి పాక సైదులు, కర్నాటి మురళి, భీముడు, రవీందర్, రేఖల సైదులు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : తిరుమలగిరి మండల కేంద్రంలో ఈ నెల 29న జరిగే బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొనే ప్రగతి నివేదన బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు గుండగాని రాములుగౌడ్ కోరారు. సోమవారం మండల పరిధిలోని గానుగుబండ గ్రామంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో సర్పంచ్ నల్లు రామచంద్రారెడ్డి, శ్రీహరి, దుర్గయ్య, శ్రీను, సూర్యప్రకాశ్, కుశలవరెడ్డి, చంద్రయ్య పాల్గొన్నారు.

# బెంచీలు, కుర్చీల బహూకరణ

చివ్వెంల : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలని మండల విద్యాధికారి కె.గోపాల్ రావు అన్నారు. ఎంజీ నగర్ తండాలోని ప్రాథమిక పాఠశాలకు చెందిన పూర్వవిద్యార్థి, ఐఆర్‌ఎస్ అధికారి రత్నావత్ భరత్ సోమవారం పాఠశాలకు బెంచీలు, కుర్చీలు బహూకరించారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి భావి పౌరులుగా ఎదగాలని సూచించారు. తల్లిదండ్రులకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రత్నావత్ కమనాథ్ సింగ్, హెచ్ఎం ఎండీ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో పలువురి చేరిక



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

చివ్వెంల : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు సభ్యులు సోమవారం ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ మాజీ జిల్లా నాయకుడు నంద్యాల నరేష్ రెడ్డి ఆధ్వర్యంలో భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నంద్యాల సోమిరెడ్డి, నంద్యాల రమేష్ రెడ్డి, పెద్దిరెడ్డి రాజా, శనగాని రాంబాబు గౌడ్, నేరేళ్ల మధు, పెద్దిరెడ్డి కళ్యాణ్, దున్నబాబు, షేక్ సాజిద్ ఖాన్, మిర్యాల శ్రీనివాస్ రెడ్డి, వేముల చిన్నాల తదితరులు పాల్గొన్నారు.

# డీవీ కృష్ణ ఆశయసాధనకు కృషి చేయాలి



తుంగతుర్తిలో డీవీ కృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాపంథా నాయకులు

తుంగతుర్తి : సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి, ప్రజాపంథా మార్గనిర్దేశకుడు డి.వెంకటకృష్ణ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకులు పేర్ల నాగయ్య, గొడ్డలి నర్సయ్య అన్నారు. డీవీ కృష్ణ ప్రథమ వర్ధంతి సందర్భంగా సోమవారం తుంగతుర్తి మండల కేంద్రంలోని దుబ్బాక సంజీవరెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. డీవీ కృష్ణ కార్మికుల పక్షాన ఎన్నో పోరాటాలు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు భాస్కర్, లింగయ్య, వెంకన్న, వీరయ్య, మల్లమ్మ, గంగమ్మ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పీవైఎల్ రాష్ట్ర మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆత్మకూర్ (ఎస్) : జూలై 4, 5వ తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణంలో జరిగే ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్ర 8వ మహాసభలను జయప్రదం చేయాలని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రాష్ట్ర మహాసభల పోస్టర్లను సంఘం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వాలు, పాలకులు యువత పట్ల నిర్లక్ష్య ధోరణితో ఉన్నారని తెలిపారు. నిరుద్యోగ యువత ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. ఈ రాష్ట్ర మహాసభలకు యువతీ యువకులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాదే మహేష్, దారమల నగేష్, శ్రీరాముల గణేష్, మహేష్, గునగంటి శ్రీను, డేగల వెంకటకృష్ణ, పగిడి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# అదనపు బస్సు కోసం విద్యార్థుల రాస్తారోకో

నడిగూడెం : మండల పరిధిలోని కరివిరాల మోడల్ స్కూల్‌వరకు అదనపు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కరివిరాలలో విద్యార్థులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడారు. ప్రస్తుతం కోదాడ డిపో నుంచి ఒక బస్సు వస్తుందని, 250 మంది విద్యార్థులకు ఆ బస్సు సరిపోవడంలేదని అన్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరొక బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దార లోకేష్, వేణు, దేవేందర్, వినోద్, విద్యార్థులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

# ముగిసిన గంగమ్మ జాతర

నడిగూడెం : మండల కేంద్రంలోని గంగమ్మ ఆలయం వద్ద రెండు రోజులుగా నిర్వహిస్తున్న జాతర సోమవారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా గ్రామంలో గంపలు, బోనాలతో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురవాలని, పంటలు బాగా పండాలని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గడ్డం నాగలక్ష్మి, అధిక సంఖ్యలో యాదవులు పాల్గొన్నారు.